క్లుప్తంగా

ఆపత్కాలంలో ఆర్‌ఎస్‌ఎస్ అత్యవసర సేవలు

నర్సాపూర్: దేశంలో విపత్తులు, పెద్ద ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలకు ఆర్‌ఎస్‌ఎస్ అత్యవసర సేవలందిస్తుందని ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ సహప్రాంత ప్రచారక్ ప్రభుకుమార్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా ప్రాథమిక శిక్షవర్గ ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు సంఘటితంగా ఉన్నప్పుడే దేశం పటిష్ఠంగా ఉంటుందని ఆర్‌ఎస్‌ఎస్ భావిస్తుందని, దేశ ప్రతిష్టతను పెంచేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ కార్యవహ నాగభూషణం, విభాగ్ ప్రచార ప్రముఖ్ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవహ ఓంకార్ యాదవ్, ఇతర ప్రతినిధులు జైహింద్‌రెడ్డి, బాగారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సింహద్వారంతో గ్రామానికి కొత్తశోభ



మహాసింహ ద్వారానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో నిర్మించనున్న మహాసింహ ద్వారం నిర్మాణంతో గ్రామానికి కొత్తశోభ సంతరించుకోనుందని జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా అన్నారు. రూ.20 లక్షలతో గూడూర్ గ్రామస్తుడు, హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ తన తల్లిదండ్రులు అంజమ్మ, లింగయ్య జ్ఞాపకార్థం తూప్రాన్- నర్సాపూర్ ప్రధాన రహదారిపై బగలాముఖీ శక్తిపీఠం మహాసింహద్వారం నిర్మాణం చేపట్టారు. దీనికి ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, బగలాముఖీ ఉపాసకులు, వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛభారత్

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారంలో నేచర్ ఐకాన్ యూత్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని రైతువేదిక వద్ద పిచ్చి మొక్కలు, చెత్త చెదారం తొలగించారు. అనంతరం పరిసరాలను శుభ్రం చేశారు. చెత్తను డంప్‌యార్డ్‌కు తరలించారు.

చంద్రయాన్ బతుకమ్మ



చంద్రయాన్ బతుకమ్మతో అవంతి

రామాయంపేట(మెదక్): చంద్రయాన్ రాకెట్‌ను పోలిన బతుకమ్మను పట్టణానికి చెందిన ఎర్రం అవంతి తయారు చేసింది. ఈ బతుకమ్మ చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. బతుకమ్మ సంబరాల అనంతరం చెరువులో నిమజ్జనం చేసింది.

రాజన్న రాజ్యం షర్మిలతో సాధ్యం

టేక్మాల్(మెదక్): దివంగతనేత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాజ్యం షర్మిలతో సాధ్యమని వైఎస్సార్ తెలంగాణ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు టి.నరేష్ అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రమైన టేక్మాల్‌లో మాట్లాడారు. వైఎస్‌ఆర్ పాలనలో చేసిన అభివృద్ధే తప్ప బీఆర్‌ఎస్ పార్టీ చేసింది ఏమీ లేదన్నారు. మళ్లీ రాజన్న రాజ్యం రావాలంటే వైఎస్‌ఆర్‌టీపీ అధికారంలోకి రావాలన్నారు. ఇందుకు వైఎస్‌ఆర్‌టీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గ్రామాల్లో సునీతారెడ్డి పర్యటన

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి, ధర్మాసాగర్ గ్రామాలలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ఆదివారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరిగిన బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అంతక ముందు తునికి శ్రీనల్లపోచమ్మ దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అక్రమ మద్యం పట్టివేత

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చండూర్ గ్రామంలో శనివారం రాత్రి బెల్ట్ దుకాణంపై దాడి చేసిన పోలీసులు అక్రమంగా అమ్ముతున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఎస్‌ఐ మహబూబ్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన కమ్మరా నాగరాజు బెల్ట్ దుకాణం నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందిందన్నారు. అతడి దుకాణంపై దాడి చేయగా రూ.4 వేలు విలువ చేసే మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. బాటిళ్లను స్వాధీనం చేసుకొని బెల్ట్ షాపు నిర్వహిస్తున్న నాగరాజుపై కేసు నమోదు చేశామన్నారు.



పాపన్నపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



రేగోడ్‌లో త్రిష దామోదర్..

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..

సద్దుల బతుకమ్మ వేడుకలు ఆయా గ్రామాలు, పట్టణాల్లో ఘనంగా జరిగాయి. ఆదివారం మహిళలు బతుకమ్మలను తయారు చేసి వాటిని గ్రామ కూడళ్లు, చౌరస్తాల్లో ఉంచి పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. అనంతరం వాటిని చెరువుల్లో నిమజ్జనం చేశారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. సద్దులు పంచిపెట్టారు.



వెల్దుర్తి-చెర్లపల్లిలో బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు



పెద్దశంకరంపేట(మెదక్): రామోజీపల్లిలో ..



రంగంపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నిజాంపేటలో బతుకమ్మ పాటలు పాడుతున్న మహిళలు



రామాయంపేటలోని రెడ్డి కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



అల్లాదుర్గం: బహిరన్‌దిబ్బలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం



శివ్వంపేట(నర్సాపూర్): చండీలో సద్దుల బతుకమ్మ వేడుకల దృశ్యం



మనోహరాబాద్(తూప్రాన్): కాళ్ళకల్‌లో ఆకట్టుకున్న భారీ బతుకమ్మ



తూప్రాన్ ఇస్లాంపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): ఫైజాబాద్‌లో సద్దుల బతుకమ్మ ఆడుతున్న మహిళలు



టేక్మాల్‌లో బతుకమ్మలు పేర్చిన దృశ్యం



కౌడిపల్లి: రాయిలాపూర్‌లో బతుకమ్మ వేడుకలు



చేగుంట(తూప్రాన్): చందాయిపేటలో నిమజ్జనానికి తీసుకెళ్తున్న పెద్ద బతుకమ్మలు



చిన్నశంకరంపేట(మెదక్): శేరిపల్లిలో బతుకమ్మ సంబురాలు

బగలాముఖీ ఆలయంలో లక్ష హరిద్రార్చన



బగలాముఖీ అమ్మవారు



పూజల్లో పాల్గొన్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో బగలాముఖీ ఆలయంలో శుక్రవారం లక్ష హరిద్రార్చన పూజా మహోత్సవం నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ బగలా మహామంత్రహవనము తదితర పూజా కార్యక్రమాలు వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, ఆలయ భూదాత పబ్బ రమేష్‌గుప్తా, హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్, జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, నర్సాపూర్ ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, ఉప సర్పంచ్ పద్మ, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

చిన్నశంకరంపేట(మెదక్): అనుమాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. చిన్నశంకరంపేట ఎస్‌ఐ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్ గ్రామానికి చెందిన పట్నం నాగులు(42) కస్తూర్బా పాఠశాల సమీపంలో ఉరివేసుకున్నాడు. మృతదేహంపై గాయాలు ఉండటంతో మృతిపై అనుమానాలు నెలకొన్నాయి. కాగా రుద్రారం గ్రామానికి చెందిన పద్మతో 18 సంవత్సరాల క్రితం వివాహమైంది. భార్యాభర్తలు గొడవపడటంతో పిల్లలను తీసుకుని భార్య పుట్టింటికి వచ్చింది. 20 రోజుల క్రితం పెద్దలు పంచాయతీ నిర్వహించి పద్మను భర్తతో పంపించారు. మృతుడి సోదరి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. శవ పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్త వార్తలు

◆ **పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలి**

కౌడిపల్లి(నర్సాపూర్): దసరా పండగను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఏఎస్‌ఐ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని దేవులపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ, దసరా పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు.

◆ **మాజీ సర్పంచ్ మృతి**

చేగుంట(తూప్రాన్): పెద్దశివునూర్ మాజీ సర్పంచ్ రాంచంద్రంనాయక్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. కొద్దిరోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. మాజీ సర్పంచ్ మృతి పట్ల సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు సంతాపం తెలిపారు.

◆ **సర్పంచ్ రక్తదానం**

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మంగళపర్తి గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ దుర్గాప్రసాద్ కొంతకాలంగా శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. శస్త్రచికిత్సకు రక్తం అవసరం కావడంతో సర్పంచ్ రామకృష్ణారావుతో పాటు గ్రామస్తులు శ్రీనివాస్, దుర్గలింగం, షఫి, సిద్దులు హుటాహుటిన హైదరాబాద్ వెళ్లి రక్తదానం చేశారు. పంచాయతీ కార్మికుడికి రక్తదానం చేసిన సర్పంచ్, యువకులను గ్రామస్తులు అభినందించారు.

◆ **గ్రామస్థాయి క్రికెట్ పోటీలు**

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి చిన్నగొట్టిముక్ల గ్రామంలో ఆదివారం గ్రామ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. గ్రామ యవకుడు గుమ్మడి ఎల్లయ్య ఈ పోటీలు నిర్వహించగా పలు జట్లు పాల్గొన్నాయి. విజయం సాధించిన జట్టుకు బహుమతి ప్రదానం చేశారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కల్గుతుందని నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో పాపయ్యాచారి, వీరాస్వామి, భిక్షపతి తదితరులు ఉన్నారు.

◆ **కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక**

టేక్మాల్(మెదక్): మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం మండలంలోని కుసంగి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు మహమ్మద్ ఆరిఫ్, 6వ వార్డు సభ్యుడు నాగరత్నం గౌడ్, గ్రామ ముదిరాజ్ సంఘం, కురుమ సంఘం, పద్మశాలి సంఘం, కుమ్మరి సంఘం, దళిత సంఘం , రజక సంఘం నాయకులు, బీజేపీ బూత్ కమిటీ సభ్యులు పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



అల్లాదుర్గంలో దీపారాధన చేస్తున్న మహిళలు

మహిషాసురమర్దినిగా దుర్గమ్మ

దేవి శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తోంది. ఆదివారం దుర్గామాత మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చింది. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మహిళలు కుంకుమార్చన, అభిషేకాలు చేశారు. అమ్మవారి మండపాల వద్ద అన్నదానం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్ర అమ్మవారికి పూజలు చేస్తున్నారు.



కాళ్ళకల్‌లో అమ్మవారి పూజలో పాల్గొన్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



కొడుపాకలో మహిషాసురమర్దినిగా దుర్గమ్మ



పెద్దశంకరంపేటలో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్‌లో చాముండేశ్వరీ అమ్మవారు



శివ్వంపేట(నర్సాపూర్): చండి గ్రామంలో మహిషాసురమర్దినిగా చండికాంబ



కొల్చారం(నర్సాపూర్): రంగంపేటలో అమ్మవారి సన్నిధిలో దీపారాధన చేస్తున్న భక్తులు



కాళ్ళకల్ బంగారమ్మ దేవాలయంలో చండీ హోమం చేస్తున్న అమ్మవారి భక్తులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



పాండరి (ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో తీవ్రగాయాలతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. దీంతో ఈ ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతి చెందిన వారి సంఖ్య రెండుకు చేరింది. ఈనెల 13వ తేదీన వడ్ల వీరమణి ఇంట్లో గ్యాస్ సిలిండర్ అయిపోవడంతో ఆమె ఇంటి పక్కనే ఉన్న పాండరి మరో సిలిండర్‌ను అమర్చాడు. గ్యాస్ స్టవ్ వెలిగించే ప్రయత్నంలో గ్యాస్‌లీకై భారీ శబ్దంతో పేలడంతో ఇంటి పైకప్పు మొత్తం నేలకూలింది. ప్రమాదంలో నలుగురికి గాయాలు కాగా ఈనెల 17వ తేదీన చికిత్స పొందుతూ వడ్ల వీరమణి మృతిచెందింది. మంగలి శ్యామల, వరలక్ష్మి ఇరువురు గాయాలతో చికిత్స పొందుతున్నారు. పదిరోజుల పాటు చికిత్స పొందుతూ పాండరి మృతిచెందడంతో గ్రామంలో విషాదం అలుముంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్‌గౌడ్ తెలిపారు.

ఆటో ఢీకొని వృద్ధుడి దుర్మరణం



రాములు (ఫైల్)

చేగుంట(తూప్రాన్): పొలానికి వెళ్తున్న వృద్ధుడిని ఆటో ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని రుక్మాపూర్ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం రుక్మాపూర్ గ్రామస్తుడు కంచనపల్లి రాములు యాదవ్(70) రోజు మాదిరిగా నడుచుకుంటూ పొలానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో చేగుంట నుంచి బోనాల్ వెళ్తున్న ప్యాసింజర్ ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాములు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ హరీశ్ పంచనామా నిర్వహించి కేసునమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.